సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 26 । జూలై । 2025



చీనీ టన్ను రూ.17,500
అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17,500, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.34
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.34, కనిష్టంగా రూ.17 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 2,700 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
31.6°/21.8°
జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

బంగారు కుటుంబాల భవిత మార్చాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ చేతన్



అధికారులతో వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: పీ–4 సర్వేలో భాగంగా బంగారు కుటుంబాలుగా గుర్తించిన వారి భవిత మార్చేందుకు అధికారులు పని చేయాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఆర్డీఓలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల స్పెషలాఫీసర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీ–4, బంగారు కుటుంబాల దత్తత, మార్గదర్శకుల ఎంపిక, నమోదు, గ్రామ సభలు, ప్రభుత్వ పథకాల సేవలు, ప్రజాస్పందనలు తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..క్షేత్రస్థాయిలో బంగారు కుటుంబాల దత్తత, ఎంపిక, నమోదు ప్రక్రియను త్వరగా ఆన్‌లైన్ చేయాలన్నారు. డాక్యుమెంటేషన్ సైతం వేగంగా పూర్తి చేయాలన్నారు. బంగారు కుటుంబాలకు పథకాలన్నీ అందేలా చూడాలన్నారు. అలాగే ఆయా మండలాల్లోని వసతి గృహాలను అధికారులు వారంలో ఒకసారి సందర్శించి తాగునీరు, పైప్‌లైను మరమ్మతులతో పాటు ఇంకా ఏవైనా సమస్యలుంటే పరిష్కరించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 'తల్లికి వందనం' కోసం వచ్చిన దరఖాస్తులను ఆయా ఎంపీడీఓలు పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ–కేవైసీ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సీపీఓ విజయ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఎస్‌డీసీలు సూర్యనారాయణరెడ్డి, రామసుబ్బయ్య, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శివరంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పీడీగా ప్రమీల

పుట్టపర్తి అర్బన్: జిల్లా సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) ప్రాజెక్టు డైరెక్టర్‌గా ప్రమీల నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె తిరుపతి జిల్లా పుత్తూరు సీడీపీఓగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఆమెకు పదోన్నతి కల్పించి జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక పీడీగా పని చేస్తున్న శ్రీదేవిని తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ చేసింది. నూతన ఐసీడీఎస్ పీడీ ఎప్పుడు విధుల్లో చేరుతారన్న విషయం ఇంకా అధికారికంగా సమాచారం అందలేదు. నూతన పీడీ విధుల్లో చేరే దాకా ప్రస్తుతం ఉన్న పీడీ శ్రీదేవి ఇక్కడే కొనసాగుతారని తెలుస్తోంది.

అది చెరువు స్థలమే!

- చెరువు స్థలం అన్యాక్రాంతంపై కలెక్టర్ ఆగ్రహం
- సమగ్ర విచారణ.. చెరువు స్థలమేనని తేల్చిన అధికారులు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన వైనం



సర్వే నంబర్ 661లోని చెరువు స్థలం అన్యాక్రాంతం కాకుండా హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన ఇరిగేషన్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ధర్మవరం: పట్టణంలోని స్పందన ఆస్పత్రికి ఎదురుగా సర్వే నంబర్ 661లోని ఖాళీ స్థలం చెరువు స్థలమేనని అధికారులు తేల్చారు. ఆ స్థలం ఎలాంటి కట్టడాలు, నిర్మాణాలు చేపట్టకూడదని హెచ్చరిక బోర్డును సైతం ఏర్పాటు చేశారు. సర్వే నంబర్ 661లోని చెరువు స్థలాన్ని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తుండగా... 'ఖాళీ కనిపిస్తే కబ్జా' శీర్షికన ఈనెల 21న 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై కలెక్టర్ టీఎస్ చేతన్ తీవ్రంగా స్పందించారు. సదరు స్థలం గురించి సమగ్ర వివరాలు కావాలని కోరారు. దీంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు విచారణ జరిపారు. అది చెరువు స్థలమే నిర్ధారించారు. "ఈ స్థలం ధర్మవరం చెరువుకు సంబంధించింది... ఈ సర్వే నంబర్‌లో ఎలాంటి ఆక్రమణలు, నిర్మాణాలు జరపరాదు. అలా జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అంటూ హెచ్చరిక బోర్డును సైతం ఏర్పాటు చేశారు. ధర్మవరం పట్టణ నడిబొడ్డున దాదాపు రూ.కోటికిపైగా విలువైన చెరువు భూమి కబ్జా కాకుండా చూసిన 'సాక్షి'కి పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

అప్పు.. వడ్డీతో ముప్పు!

పేదలను పీడిస్తోన్న వ్యాపారులు



- **ధ**ర్మవరానికి చెందిన రమణ, భారతి దంపతులు వ్యక్తిగత అవసరం నిమిత్తం ఎర్రగుంటకు చెందిన రాజాతో రూ.6 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఇందుకుగాను రూ.100కు రూ.10 చొప్పున వడ్డీ చెల్లించాలని చెప్పడంతో... అప్పుడున్న అవసరం మేరకు రమణ ఒప్పుకున్నారు. ప్రతి నెలా వడ్డీ రూపంలోనే రూ.60 వేలు చెల్లించేవాడు. అయితే ఆర్థిక ఇబ్బందులతో మూడు నెలలుగా వడ్డీ చెల్లించలేకపోయాడు. దీంతో వడ్డీవ్యాపారి రాజా మనుషులను వెంట బెట్టుకుని వచ్చి రమణ, భారతి ఇంటికి వెళ్లి వారిపై దాడి చేశాడు. బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఇలాంటి ఘటనలు ధర్మవరంలో రోజూ కనీసం ఒకటైనా వెలుగుచూస్తోంది.

- **హిం**దూపురానికి చెందిన రాజ తన అవసరాల నిమిత్తం రూ.10 వడ్డీతో రూ.10 లక్షలు అప్పు చేశాడు. వ్యాపారంలో నష్టం రావడంతో వడ్డీ సైతం చెల్లించలేకపోయాడు. దీంతో సదరు వడ్డీ వ్యాపారి ఇల్లు రాసివ్వాలని ఒత్తిడి చేశాడు. ఇల్లు తన పేరుపై లేదని రాజా చెప్పడంతో అతన్ని కిడ్నాప్ చేశాడు. దీంతో రాజా కుటుంబీకులు అప్పటికప్పుడు రూ.2 లక్షలు వడ్డీ వ్యాపారికి చెల్లించి రాజాను విడిపించాడు. ఈ ఘటన తర్వాత రాజా కుటుంబం హిందూపురం వదిలి వెళ్లిపోయింది.

- **ప**ుట్టపర్తిలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద ఓ వ్యక్తి తన వ్యాపారం నిమిత్తం అప్పులు చేశాడు. సకాలంలో రుణాలు చెల్లించలేక.. రుణదాతల ఒత్తిళ్లు తట్టుకోలేక ఇల్లు విక్రయించాలనుకున్నాడు. అయితే రుణదాతల్లోని కొందరు రూ.2.5 కోట్లకు ఆ ఇంటిని కొనేందుకు సిద్ధమయ్యారు. కానీ వారికి రావాల్సిన డబ్బుకు అధిక వడ్డీలు లెక్కగట్టి బలవంతంగా ఇంటిని ఆక్రమించాలని చూశారు. దీంతో సదరు వ్యాపారి అడ్డం తిరిగాడు. ప్రస్తుతం ఈ వివాదం కోర్టులో నడుస్తోంది.

- అవసరాన్ని బట్టి మారుతున్న వడ్డీ
- నూటికి వారానికే రూ.10 చొప్పున వసూలు
- ధర్మవరం, హిందూపురంలో తిష్టవేసిన మాఫియా
- సకాలంలో వడ్డీ చెల్లించని వారిపై భౌతిక దాడులు
- ఇళ్ల వద్దకు వెళ్లి బూతు పురాణాలు
- అవమానంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న బాధితులు

సాక్షి, పుట్టపర్తి: మనిషి మానవత్వం మరచి 'మనీ'షిగా మారిపోయాడు. డబ్బుకోసం ఎంతకైనా దిగజారుతున్నాడు. కొందరైతే ఇతరుల అవసరాలతోనే వ్యాపారం చేస్తున్నారు. వడ్డీ వ్యాపారుల అవతారం ఎత్తి జనాన్ని జలగల్లా పీడిస్తున్నారు. ఇటీవల వడ్డీ వ్యాపారుల ఆగడాలు మరింత పెరిగిపోయాయి. అప్పుకోసం వచ్చిన వారి పరిస్థితిని బట్టి వడ్డీ నూటికి రూ.10 నుంచి రూ.30 వరకూ వెళ్లిపోతోంది. అత్యవసరంలో వడ్డీ గురించి ఆలోచించని జనం ఆ తర్వాత అసలుకు మించి వడ్డీలు చెల్లిస్తూ అల్లాడిపోతున్నారు. ఆ తర్వాత కళ్లుతెరిచి ప్రశ్నించినా... వడ్డీ వ్యాపారులు దాడులకు దిగుతున్నారు.

ఆత్మహత్యలకు తెగిస్తున్న బాధితులు

గతంలో ఎవరైనా అప్పు చేస్తే ఏడాది తర్వాత అసలు, వడ్డీ చెల్లించేవారు. అది కూడా నూటికి రూ.2 మించి ఉండేది కాదు.. కానీ ఇప్పుడు వడ్డీ వ్యాపారం చాలా మారిపోయింది. అప్పు కోసం వచ్చిన వారి అవసరాన్ని ఆసరాగా చేసుకుని వారానికే నూటికి రూ.10 నుంచి రూ.20 వరకూ వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన లక్ష అప్పు తీసుకున్న వ్యక్తి వడ్డీ రూపంలోనే వారానికి రూ.10 వేలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ వడ్డీ వ్యాపారం దందా కదిరి, హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరంలో జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కవారం వడ్డీ చెల్లించపోయినా వడ్డీ వ్యాపారులు ఇళ్ల వద్దకు వచ్చి అవమానకరంగా మాట్లాడటం.. భౌతిక దాడులు చేయడం పరిపాటిగా మారిపోయింది. అంతేకాకుండా ఇల్లు, వాహనం, ఆస్తులు రాసిచ్చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. దీంతో అప్పులు చెల్లించలేక.. ఆస్తులు అప్పజెప్పలేక బాధితులు అవమాన భారంతో ఆత్మహత్యలకు తెగిస్తున్నారు.

సిండికేటు మాఫియా

వడ్డీ వ్యాపారులు సిండికేటుగా మారి.. ఎంత శాతం వసూలు చేయాలనే దానిపై నిత్యం చర్చించుకుంటున్నట్లు తెలిసింది. అధిక వడ్డీ వసూలు చేయడంతో పాటు నిత్యం పట్టి పీడిస్తుండటం.. సకాలంలో వడ్డీ ఇవ్వకపోతే ఆస్తులు రాయించుకోవడం.. వాహనాలు తీసుకెళ్లడం.. బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టుకోవడం చేస్తున్నారు. ఎలాంటి ఆస్తులు లేనివారిపై దాడులకు దిగి.. బెదిరిస్తున్నారు. వారిని నియంత్రించాల్సిన వ్యవస్థ నిద్రావస్థలో ఉండటంతో వడ్డీ వ్యాపారుల దుర్మార్గానికి అంతేలేకుండా పోయింది.

పట్టించుకోని పోలీసులు

అధిక వడ్డీతో పేదలను పట్టి పీడిస్తున్న మాఫియాపై పదే పదే ఫిర్యాదులు అందినా.. పోలీసులు పట్టించుకోవడం లేదు. వడ్డీ వ్యాపారుల వద్ద నెల మామూళ్లు తీసుకుంటూ వారికి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అప్పు ప్రతి ఒక్కరికీ అవసరమే.. అయితే వడ్డీ ఎంత ఉండాలనే దానిపై పరిమితి లేకుండా పోయింది. పైగా నెలవారీ వడ్డీ స్థానంలో వారం వడ్డీ, రోజువారీ వడ్డీ ఇవ్వాలని బెదిరిస్తున్నా అడిగేవారు లేకుండా పోయారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



"రిజిష్టర్ చేసుకున్న దుకాణాల్లో మాత్రమే వడ్డీ వ్యాపారం జరగాలి. అవసరాల నిమిత్తం ప్రామిసరీ నోట్ల ద్వారా రూ.100కు నెలకు రూ.2 చొప్పున వడ్డీ చెల్లింపు విధానం మంచిదే. కానీ వారానికి నూటికి రూ.10 చొప్పున వడ్డీ వసూలు చేయడం చట్టరీత్యా నేరం. అప్పు చెల్లింపు విషయాల్లో దాడులకు తెగబడితే సహించేది లేదు. బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు. అధిక వడ్డీలు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. – వి.రత్న, జిల్లా ఎస్పీ

వసుంధరకు నిరసన సెగ

- ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణిని అడ్డుకున్న మధురేపల్లి వాసులు
- భూమిపూజ చేసి 11 ఏళ్లయినా గ్రామానికి రోడ్డు లేదని ఆవేదన



వసుంధరను నిలదీస్తున్న మధురేపల్లి గ్రామస్తులు

చిలమత్తూరు: హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధరకు నిరసన సెగ తగిలింది. శుక్రవారం ఆమె మండలంలోని తమ్మినాయనపల్లి గ్రామ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరుతుండగా... కోడూరు పంచాయతీ పరిధిలోని మధురేపల్లి గ్రామస్తులు ఆమెను అడ్డుకున్నారు. భూమిపూజలేనా... పనులు కూడా చేస్తారా అంటూ ప్రశ్నించారు. తమ గ్రామ రహదారి నిర్మాణం కోసం 2014 సంవత్సరంలో భూమి పూజ చేశారని, పదకొండేళ్లయినా ఇంత వరకూ రోడ్డు నిర్మాణం చేపట్టలేదని వాపోయారు. రోడ్డు లేకపోవడంతో కోడూరు తోపులోని ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏడాదికోసారి నాయకులు రావడం, భూమి పూజ చేయడం, వెళ్లిపోవడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గోడు మాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు సరిగా లేని కారణంగా వర్షాకాలం గ్రామం నుంచి రావాలంటే ఇబ్బందిగా మారిందన్నారు. అత్యవసర సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారమన్నారు. వెంటనే తమ గ్రామానికి రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు. దీంతో వసుంధర స్పందిస్తూ విషయాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పెద్దమ్మకు పత్ర సింగారం



ధర్మవరంలో తమలపాకుల అలంకరణలో పెద్దమ్మతల్లి

ధర్మవరం అర్బన్: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ఆలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. ముఖ్యంగా అమ్మవారి ఆలయాల్లో మహిళలు బారులు తీరి ప్రత్యేక పూజలు చేశారు. సామూహిత కుంకుమార్చలు, అభిషేకాలు నిర్వహించారు. ధర్మవరం పట్టణంలోని సాలే వీధిలో వెలసిన పెద్దమ్మతల్లిని శుక్రవారం తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

పచ్చనేత అండతోనే మేత

- ఏసీబీకి చిక్కిన సబ్‌రిజిస్ట్రార్ కళ్యాణదుర్గం ప్రజాప్రతినిధికి బినామీ
- కూటమి సర్కారు రాగానే శింగనమల నుంచి కళ్యాణదుర్గానికి పోస్టింగ్
- అక్కడున్న సబ్‌రిజిస్ట్రార్‌ను టార్చర్ పెట్టి వెళ్లగొట్టిన టీడీపీ నేత
- అనంతరం సీనియర్ అసిస్టెంట్ నారాయణస్వామికి ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు
- ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనుల్లో బినామీగా ఆరోపణలు
- నకిలీ ఈ–స్టాంప్ కుంభకోణంలోనూ సలహాలిచ్చి ఉంటారని అనుమానాలు



ఒత్తిడి తెచ్చి మరీ పోస్టింగ్..

సాక్షి, టాస్క్‌ఫోర్స్: తాజాగా ఓ రైతు నుంచి రూ.5 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్ నారాయణ స్వామికి ఆ ప్రాంత టీడీపీ ప్రజాప్రతినిధి పూర్తి అండగా ఉన్నట్టు తెలుస్తోంది. నారాయణస్వామి అత్యంత అవినీతిపరుడని డిపార్ట్‌మెంట్‌లో పేరుంది. అలాంటి వ్యక్తిని కూటమి సర్కారు రాగానే పట్టుబట్టి పోస్టింగ్ వేయించుకున్నారంటే దీనివెనుక కథ ఏమిటో అంచనా వేయొచ్చు. ఒక సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న నారాయణస్వామికి సబ్‌రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పజెప్పేవరకూ పనిచేయించారంటే అవినీతి కథ ఎలా నడిచిందో తెలుసుకోవచ్చు.

ఒత్తిడి తెచ్చి మరీ పోస్టింగ్..

నారాయణస్వామి శింగనమల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసేవారు. అప్పటికే కళ్యాణదుర్గం టీడీపీ నేత కంపెనీకి సంబంధించిన పనులు చేసి పెట్టేవారు. జిల్లా స్థాయిలో నారాయణస్వామి పోస్టింగ్‌కు అధికారులు స్పందించడం లేదని ఏకంగా విజయవాడలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ ఆఫీస్‌కు వెళ్లి ఆయన్ను కళ్యాణదుర్గం బదిలీ చేయించుకున్నారు. అప్పటికే కళ్యాణదుర్గంలో వెంకటనాయుడు అనే సబ్‌రిజిస్ట్రార్ ఉన్నారు. నారాయణస్వామి సీనియర్ అసిస్టెంట్‌గా వెళ్లాక టీడీపీ ప్రజాప్రతినిధితో కలిసి వెంకటనాయుడును టార్చర్ పెట్టారు. రాజకీయ ఒత్తిడి భరించలేక వెంకటనాయుడు అక్కడి నుంచి వెళ్లిపోయారు. వెంటనే అనంతపురం డీఐజీతో మాట్లాడి నారాయణస్వామికే ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పజెప్పేలా చేశారు.

పైకమిస్తేనే ఫైలుపై సంతకం..

నారాయణస్వామి సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు తీసుకున్నాక డబ్బు తీసుకోకుండా ఒక్క ఫైలు మీద కూడా సంతకాలు చేయలేదన్న ఆరోపణలున్నాయి. టీడీపీ నేతకు సంబంధించిన డాక్యుమెంట్లు ఎలా ఉన్నా చేయడంతో పాటు ఈయన ఇతరుల నుంచి వసూళ్లు చేసిన సొమ్ములో వాటాలిచ్చేవారని చెబుతున్నారు. టీడీపీ నేత కన్‌స్ట్రక్షన్ కంపెనీ స్థలాలు, ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు కూడా నారాయణస్వామే చూసుకునేవారు. టీడీపీ నేత అండ చూసుకునే ఇష్టారాజ్యంగా అవినీతి అక్రమాలకు దిగేవారని సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు సిబ్బంది చెబుతున్నారు. నారాయణ స్వామికంటే జలగలే నయమని సిబ్బంది పేర్కొనడం గమనార్హం.

ఈ–స్టాంపుల కుభకోణంలోనూ స్వామి పాత్ర?

ఇటీవలే కళ్యాణదుర్గంలో అతిపెద్ద నకిలీ ఈ–స్టాంపుల కుంభకోణం బయటపడింది. ఇందులోనూ టీడీపీ నేతల ప్రముఖ పాత్ర ఉన్నట్టు ఆరోపణలు గుప్పుమన్నాయి. ఈ కుంభకోణంలో ప్రధాన పాత్రధారి 'మీ–సేవ' బాబు అయినా.. దీనికి సలహాలు, సూచనలు నారాయణస్వామి ఇచ్చి ఉంటారని అనుమానం కలుగుతున్నట్టు ఓ సబ్‌రిజిస్ట్రార్ వ్యాఖ్యానించారు. నారాయణస్వామి సలహా లేకుండా ఇంత పెద్ద సాహసానికి పాల్పడే ధైర్యం 'మీ–సేవ' బాబుకు లేదని అంటున్నారు. ఇలాంటి అవినీతిపరుడిని టీడీపీ నేత దగ్గరుండి పోస్టింగ్ వేయించుకున్నారంటే ఎంత అవినీతి చేసి ఉంటారో అంచనా వేయొచ్చన్నారు. కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్లు పరిశీలిస్తే మరిన్ని అక్రమాలు బయటకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

కొనసాగుతున్న ఏసీబీ సోదాలు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

కళ్యాణదుర్గం: ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి నేతృత్వంలోని బృందం శుక్రవారం కూడా కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు కొనసాగించింది. గురువారం రాత్రి నాగేంద్ర నాయక్ నుంచి భూమి కన్వర్షన్‌కు రూ.5 లక్షలు లంచం తీసుకుంటుండగా అనంతపురంలో ఏసీబీ అధికారులు కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామిని పట్టుకున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే రాత్రే కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన అధికారులు రెండో రోజూ కార్యాలయంలో కీలక ఫైళ్లను తనిఖీ చేశారు. ఇటీవల చేసిన భూముల కన్వర్షన్, మున్సిపాలిటీ పరిధిలో చేసిన రిజిస్ట్రేషన్ తదితర ఫైళ్లను పరిశీలిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో కన్వర్షన్ లేకుండానే రిజిస్ట్రేషన్ చేసిన ఫైళ్లు.. డబుల్ రిజిస్ట్రేషన్లు.. ఇటీవల పలువురు తహసీల్దార్ల సంతకాలు ఫోర్జరీ చేసి సృష్టించిన డాక్యుమెంట్లకు సంబంధించిన కీలక ఫైళ్లను తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు. వాటిని కర్నూలుకు తీసుకెళ్లనున్నట్లు ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి మీడియాకు తెలిపారు.

జీఎస్టీ పక్కాగా వసూలు చేయాలి

- అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ చేతన్ ఆదేశం



మాట్లాతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: జీఎస్టీ వసూలు పక్కాగా జరగాలని, ఇందుకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ చేతన్ అధ్యక్షతన వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ హేమ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ... పన్ను దారుల నుంచి జీఎస్టీ వసూలు చేయడానికి సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నా... పన్ను పరిధిలోకి రాని సంస్థలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. డిఫాల్టర్స్ బ్యాంక్ అటాచ్‌మెంట్ విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బిల్లుల చెల్లింపుల ముందు టాక్స్ డిడక్షన్ తప్పనిసరిగా అమలు చేసి రెవెన్యూ లోటును నివారించాలన్నారు. అన్ని ప్రొఫెషనల్ సర్వీసు సంస్థలు, విద్యాసంస్థలు, ఇంజినీరింగ్/మెడికల్ ప్రొఫెషనల్స్ తప్పని సరిగా జీఎస్టీ పరిధిలోకి రావాల్సిందేనన్నారు. మున్సిపల్ కమిషనర్లు వార్డుల్లో పర్యటించి పన్నులు విధించే ప్రక్రియను బలోపేతం చేయాలన్నారు. పన్నులు వసూలు పెంపునకు సంబంధిత శాఖలు, బ్యాంకులు, స్థానిక సంస్థలు సమన్వయంతో పని చేయాలన్నారు. స్థిరాస్తుల గుర్తింపు, బకాయిల వసూళ్ల సందర్భంలో ఆస్తులను జప్తు చేయడంలో రెవెన్యూ శాఖ, పన్నుల ఎగవేస్తున్న నకిలీల గుర్తింపు, కేసుల నమోదు, ఎన్‌జీటీపీ కేసులలో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో పోలీస్ శాఖ, మైనింగ్ లైసెన్సులు మంజూరు చేసే ముందు జీఎస్టీ రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ లైసెన్సుల పునరుద్ధరణ సందర్భాల్లో వాణిజ్య పన్నుల శాఖ నుంచి బకాయిలు లేవన్న సరిఫికెట్లు పొందాలన్నారు. సమావేశంలో అనంతపురం, హిందూపురం, ధర్మవరం వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్లు భాస్కరవల్లి, సుధాకరరెడ్డి, చందు, ఎల్‌డీఎం రమణ కుమార్, డీటీఓ కరుణసాగరరెడ్డి, తదితరులు ఉన్నారు.

మహిళలకు టీడీపీ సానుభూతిపరుడి వేధింపులు



ఎమ్మెల్యే బాలకృష్ణతో టీడీపీ సానుభూతిపరుడు నాగేంద్ర (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిలమత్తూరు మండలానికి చెందిన మహిళా సంఘం సభ్యురాలిని టీడీపీ సానుభూతిపరుడు నాగేంద్ర బెదిరించిన ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. మహిళా సంఘాలు పార్టీలకు అతీతమని, అయినా ఈ పంచాయతీ కాని మీరు ఇలా బెదిరించడం సబబు కాదని సభ్యురాలు పేర్కొనడంతో తాను పార్లమెంట్ లీడర్‌నంటూ సదరు నేత బుకాయిస్తూ బెదిరింపులకు దిగాడు. టీడీపీకి అనుకూలంగా పని చేయకపోతే నీ సంగతి చూస్తానంటూ హెచ్చరికలు జారీ చేశారు. కాగా, ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర పర్యటన నేపథ్యంలో మహిళా జనసమీకరణ చేయాలన్న ఆలోచనలో టీడీపీ నేతలు, కార్యకర్తలు ఇలా వేధింపులకు గురి చేస్తున్నట్లు సమాచారం.

చిగిచెర్లలో కేంద్ర బృందం సభ్యుల పర్యటన



చెత్త సేకరణపై సూచనలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ధర్మవరం రూరల్: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్–2025లో భాగంగా ధర్మవరం మండలం చిగిచెర్ల గ్రామంలో కేంద్ర బృందం సభ్యుడు కె. రామాంజనేయులు, జిల్లా ఎస్‌బీఎం కోఆర్డినేటర్లు అనంత, డి. సాయినాథ్‌బాబు, ఎంపీడీఓ సాయి మనోహర్ శుక్రవారం పర్యటించారు. గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్, అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయం, చెత్తతో సంపద తయారీ కేంద్రం, వ్యక్తిగత మరుగుదొడ్లు, నీటి వసతి, పరిసరాల పరిశుభ్రత, తదితరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబయ్య, డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేష్ చౌదరి, పంచాయతీ కార్యదర్శి రెడ్డమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన ఎస్‌ఐలు



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌ఐలు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన 10 మంది ఏఎస్‌ఐలు శుక్రవారం ఎస్పీ రత్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎక్కడ ఏ క్యాడర్‌లో పనిచేసిన పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ సూచించారు. ఎస్పీని కలిసిన ఎస్‌ఐల్లో ఆర్.ధనుంజయ బాబు, ఎ.లక్ష్మీనారాయణ, ఎమ్.వి.కృష్ణారెడ్డి, సి.బాలకృష్ణ, ఎస్.లోకనాథ్, ఎ.ఓబులేసు, ఎస్.మహబూబ్‌బాషా, ఆర్.జయరామిరెడ్డి, ఆర్.మురళీమోహన్, బి.చిన్నబాలాజీ ఉన్నారు. వీరిని కర్నూలు, నంద్యాల.అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు పోస్టింగ్ ఇచ్చారు.

నిందితుల అరెస్ట్

తలుపుల: వ్యవసాయ బోరుబావులకు ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్ల కేబుల్ అపహరిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు తలుపుల ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు. వారం రోజులుగా టి.రెడ్డివారిపల్లి, వేపమానిపేట, పెద్దపల్లి, మాడికవాండ్లపల్లి, తురకవాండ్లపల్లి గ్రామాలలో విద్యుత్ మోటార్ కేబుల్ చోరీకి గురవుతున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులు అందడంతో కేసు దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం అనుమానాస్పదంగా కనిపించిన దిగువపేటకు చెందిన పి.అమీనుల్లా, పి.ఆరీఫ్‌వుల్లా, కుమ్మరపేటకు చెందిన ఎస్.షర్ఫుద్దీన్‌వలిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో కేబుల్ అపహరణలు వెలుగులోకి వచ్చాయన్నారు. వీరి నుంచి రూ.1.50 లక్షల విలువైన కేబుల్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వలస కూలీ అనుమానాస్పద మృతి



మృతుడు ఏకనాథ్

కదిరి అర్బన్: మండల పరిధిలోని యర్రదొడ్డి సమీపంలో హంద్రీ-నీవా కాలువ పనుల్లో పాలుపంచుకుంటున్న మహారాష్ట్రకు చెందిన వలస కూలీ ఏకనాథ్ సత్యప్పకాంబ్లే (47) మృతి చెందాడు. గురువారం రాత్రి పనులు ముగించుకున్న షెడ్డులో నిద్రించిన ఆయన చూడగానే మృతి చెంది ఉండడం గమనించిన తోటికూలీల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కార్మికుల భద్రత గాలికి!

- పారిశ్రామిక వాడల్లో తరచూ ప్రమాదాలు
- నామమాత్రపు తనిఖీలకే పరిమితమైన అధికారులు
- ప్రమాదాల బారిన పడుతున్న వలస కార్మికులు

పరిశ్రమల్లో భద్రతను గాలికి వదిలేశారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హడావుడి చేసి తరువాత మర్చిపోవడం జిల్లాలోని అధికారుల నుంచి యజమానుల వరకు సాధారణమైపోయింది. ప్రతి నెలా సగటున రెండు నుంచి మూడు ప్రమాదాలు జరుగుతున్నా వీరి వైఖరిలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు.

హిందూపురం: జిల్లాలోని పరిశ్రమల్లో భద్రత, కాలుష్యం వంటి అంశాలపై సంబంధిత శాఖలు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. పరిశ్రమల్లో తరచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాల నేపథ్యంలో పరిశ్రమల్లోని భద్రత డొల్లతనం బయటపడుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిశ్రమలపై ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి, ఇతర శాఖల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలున్నాయి. పరిశ్రమల స్థాపనకు, కార్మికుల రక్షణకు, భద్రతకు తామేదో చేస్తున్నట్లుగా హైపర్ కమిటీ హడావిడి తప్ప సాధించిన ప్రగతి అంటూ ఏదీ లేదు.

భద్రత ప్రమాణాలు తుంగలోకి

జిల్లాలోని హిందూపురం, పెనుకొండ, గోరంట్ల, కదిరి, ధర్మవరం తదితర ప్రాంతాల్లో పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. హిందూపురం నియోజకవర్గం పరిసరాల్లో సుమారు 20 వేల మందికి పైగా కార్మికులు వివిధ పరిశ్రమలు, అనుబంధ పరిశ్రమలలో పనిచేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పరిశ్రమల ఆధారపడి పరోక్షంగా మరో 50 వేల మంది కార్మికుల జీవనం సాగిస్తున్నారు. హిందూపురం సమీపంలోని తూముకుంట, గోళ్లాపురం, మణేసముద్రంలో స్టీల్, రసాయన పరిశ్రమలతో పాటు వాటి అనుబంధ సంస్థలు, రబ్బర్, గ్యాస్ తదితరాల ఉత్పత్తికి సంబంధించి దాదాపు 150 చిన్న, పెద్ద తరహా పరిశ్రమలు ఉన్నాయి. సాంకేతిక కారణాలతో పాటు మానవ తప్పిదాలతో ఆయా పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల నియంత్రణ, కార్మికుల భద్రతను అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలు గాలికి వదిలేసినట్లుగా ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ ఏడాదిలో ఏ ఒక్క పరిశ్రమలోనూ కార్మిక శాఖ అధికారులు తనిఖీలు చేపట్టకపోవడం ఇందుకు నిదర్శనం.



హిందూపురం సమీపంలోని తూముకుంట పారిశ్రామిక వాడలోని పరిశ్రమలు

మచ్చుకు కొన్ని...

- నాలుగు రోజుల క్రితం గోళ్లాపురంలోని బ్లూగోల్డ్ స్టీల్ పరిశ్రమలో వలస కార్మికుడు అనూప్ ప్రమాదవశత్తూ గాయపడి కాలు పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని ఫ్యాక్టరీ యాజమాన్యం గోప్యంగా ఉంచింది.
- 8 ఏళ్ల క్రితం హిందూపురం సమీపంలోని ఓ పరిశ్రమలో సిలిండర్ పేలి ఇద్దరు తీవ్రంగా గాయపడి కాళ్లు, చేతులు పోగొట్టుకున్నారు.
- గోళ్లాపురం స్టీల్ పరిశ్రమలో క్రేన్ రోప్ చుట్టుకుని ఓ కార్మికుడు మృతి చెందాడు. అలాగే కెమికల్ ఫ్యాక్టరీలో రియాక్టర్ పేలి ఓ కార్మికుడు మృతి చెందాడు.
- గోళ్లాపురం స్టీల్ పరిశ్రమలో గతంలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఉత్తరప్రదేశ్, బిహార్‌కు చెందిన ముగ్గురు కార్మికులు మృతి చెందారు. అలాగే గత ఏడాది జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు మృత్యువాత పడ్డాడు.

అలాగే కెమికల్ పరిశ్రమలో కార్మికుడు హనుమంతప్ప చేతిపై రసాయనం పడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదాలు చోటు చేసుకున్న ప్రతిసారీ యాజమాన్యాలు గోప్యత పాటించడం పరిపాటిగా మారింది. మరికొన్ని పరిశ్రమల యజమానులు బాధితులకు అంతోఇంతో ఇచ్చి విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం.

త్వరలో స్పెషల్ డ్రైవ్

ఇప్పుడున్న ఈఓడీబీ యాక్ట్ ప్రకారం పరిశ్రమల్లో సౌకర్యాలు, భద్రత ఏర్పాట్లపై యాజమాన్యాలు నివేదికలు అందజేయాలి. వీటి ఆధారంగా పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టి కార్మికుల భద్రత, ప్రమాదాల నివారణ చర్యలపై అవసరమైన సూచనలిస్తాం. తూముకుంటలోని స్టీల్ ఫ్యాక్టరీలో జరిగిన ఘటన మా దృష్టికి వచ్చింది. ఇదే కాకుండా త్వరలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి అన్ని పరిశ్రమలను తనిఖీ చేయనున్నాం.

– రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్, పరిశ్రమల శాఖ, అనంతపురం

ప్రమాదాల నివారణ ముఖ్యం



ఇతర రాష్ట్రాలకు చెందిన ఎంతో మంది వలస వచ్చి హిందూపురం పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమల్లో అతి తక్కువ వేతనానికి పనులు చేస్తున్నారు. ఆయా పరిశ్రమల్లో ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు విషయం బయట పడకుండా బాధితులకు ఎంతో కొంత ముట్టుజెప్పి సర్దుబాటు చేసుకుంటున్నారు. కార్మికుడు మరణిస్తే గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాలను వారి రాష్ట్రాలకు పంపించేస్తున్నారు. ప్రమాదాల నివారణే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రవికుమార్, కార్మిక సంఘం అధ్యక్షుడు, తూముకుంట

బీమా సదుపాయం కల్పించాలి



పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు ఫ్యాక్టరీ యాజమాన్యం బాధ్యతగా వ్యవహరించడం లేదు. ప్రమాదాలను దాచి క్షతగాత్రులకు ఎంతో కొంత ముట్టజెప్పి లోబర్చుకుంటున్నారు. ఒక కార్మికుడు ప్రమాదం బారిన పడితే అతని కుటుంబం రోడ్డున పడుతుంది. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు పటిచర్యలు చేపట్టాలి. కార్మికులకు బీమా సదుపాయం కల్పించాలి.

– బాబు, కార్మిక సంఘం నాయకుడు, తూముకుంట

డీఎల్‌డీఏ ఈఓగా డాక్టర్ వెంకటేష్

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డిస్ట్రిక్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ- డీఎల్‌డీఏ) ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈఓ)గా డాక్టర్ జి.వెంకటేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పశుసంవర్ధకశాఖ ఉరవకొండ డివిజన్‌లో డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా పనిచేస్తున్న ఆయన నెల క్రితమే శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో ఉన్న వెటర్నరీ పాలీక్లినిక్ (వీపీసీ) డీడీగా బదిలీ అయ్యారు. తాజాగా అనంతపురంలో ఉన్న డీఎల్‌డీఏ ఈఓగా ఫారిన్ సర్వీసు కింద ఏడాది పాటు కొనసాగేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా ఇక్కడ ఇంతకాలం ఈఓగా ఉన్న డాక్టర్ టీవీ సుధాకర్ పదవీ కాలం ఈ నెల 14న ముగిసింది. డాక్టర్ టీవీ సుధాకర్‌ను ఉరవకొండ డీడీగా నియమించినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. త్వరలో ఆయనను ఉరవకొండ డీడీతో పాటు పశుసంవర్ధకశాఖ జేడీ (ఎఫ్ఏసీ)గా నియమించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

నలుగురు విద్యార్థులూ క్షేమం

అనంతపురం: ఎవరికీ చెప్పకుండా గురువారం మధ్యాహ్నం పాఠశాల నుంచి వెళ్లిపోయిన నలుగురు విద్యార్థుల ఆచూకీని పోలీసులు గుర్తించారు. అనంతపురం నుంచి తిరుమలకు వెళ్లిపోవడంతో అక్కడి నుంచి శుక్రవారం అనంతపురానికి తీసుకువస్తున్నారు. కూడేరు, నార్పల, గార్లదిన్నె, గోరంట్ల మండలాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఒకటో రోడ్డులోని పొట్టిశ్రీరాములు పాఠశాలలో 8, 9, 10వ తరగతులు చదువుతున్నారు. మూడో రోడ్డులోని బీసీ హాస్టల్‌లో ఉంటున్నారు. తరచూ పాఠశాలకు డుమ్మా కొడుతుండడంతో హెచ్‌ఎం మందలించారు. దీంతో నలుగురూ ఏకమై స్కూల్ నుంచి వెళ్లిపోయారు. విద్యార్థుల మిస్సింగ్‌పై హాస్టల్ వార్డెన్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన అనంతపురం మూడో పట్టణ పీఎస్ సీఐ శాంతిలాల్.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు తిరుమలలో ఉన్నట్లుగా పసిగట్టి, అక్కడి పోలీసు వారి సహకారంతో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని అనంతపురానికి తీసుకువస్తున్నారు.

రైతు సభ్యత్వమంటూ మోసం

- కార్డుకు సర్వీసు చార్జ్ పేరుతో రూ.200 వసూలు
- కార్డుంటే రూ.లక్షల్లో బ్యాంకు రుణాలంటూ బురిడీ
- స్థానికుల నిలదీతతో ఉడాయించిన జంట

పామిడి: రైతు సభ్యత్వ కార్డు ఉంటే ప్రధాని నరేంద్ర మోదీ స్కీమ్ పేరుతో కేంద్ర ప్రభుత్వం రూ.లక్షల్లో బ్యాంక్ రుణాలు ఇస్తుందంటూ ఓ జంట మోసానికి తెరలేపిన ఘటన పామిడి మండలంలో వెలుగు చూసింది. దీనిపై రైతులు నిలదీయడంతో సమాధానాలు ఇవ్వలేక ద్విచక్ర వాహనంపై ఉడాయించారు. వివరాలు.. నాలుగు రోజులుగా ఇద్దరు వ్యక్తులు (వీరిలో ఒకరు మహిళ) ద్విచక్ర వాహనంపై పామిడి మండలంలోని గ్రామాల్లో తిరుగుతూ రైతు సభ్యత్వ కార్డులంటూ పలువురి నుంచి డబ్బు వసూళ్లకు తెరలేపారు. శుక్రవారం ఉదయం పామిడి పంచాయతీలోని మజారా గ్రామమైన పి.కొత్తపల్లికి చేరుకుని రైతులతో సమావేశమై మాట్లాడారు. ప్రధాని స్కీమ్ అంటూ నమ్మబలికారు. దీంతో దాదాపు 500 మంది రైతులు ఒక్కొక్కరు రూ.200 చొప్పున చెల్లించి సభ్యత్వ కార్డులు పొందారు. తమ ఆధార్ కార్డు నంబర్, బ్యాంక్ ఖాతాకు అనుసంధానమైన సెల్‌ఫోన్ నంబర్‌ను అందజేశారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన ఓ రైతు అనుమానం వచ్చి వారిని నిలదీశాడు. పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో వారు మోసగాళ్లని గుర్తించి గట్టిగా ప్రశ్నించడంతో ద్విచక్ర వాహనంపై ఉడాయించారు.



మోసంపై రైతులు నిలదీయడంతో ద్విచక్ర వాహనంపై ఉడాయిస్తున్న జంట

జంట ఆత్మహత్యాయత్నం

- కదులుతున్న రైలు నుంచి దూకి వివాహిత మృతి
- రైల్వే ట్రాక్‌పై పడుకొని యువకుడి ఆత్మహత్యాయత్నం
- సకాలంలో అక్కడికి చేరుకుని కాపాడిన పోలీసులు

గార్లదిన్నె: ఉపాధి అవకాశాలు దక్కకపోవడంతో ఓ జంట ఆత్మహత్యాయత్నం చేసింది. కదులుతున్న రైలు నుంచి దూకి వివాహిత మృతి చెందగా.. రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడిని స్థానికుల సాయంతో పోలీసులు కాపాడారు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా ఐలూరుకు చెందిన మహేష్ బతుకు తెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ అప్పటికే వివాహమై భర్త మృతిచెంది ఒంటరిగా జీవిస్తున్న దీపిక పరిచయమైంది. ఇద్దరూ కలసి సహజీవనం సాగించేవారు. ఈ క్రమంలో పని కోసం వారం రోజుల క్రితం ఇద్దరూ గుంటూరుకు వెళ్లారు. అక్కడ పని దొరక్కపోవడంతో గుంతకల్లు మీదుగా గురువారం అనంతపురానికి చేరుకున్నారు. అక్కడ కూడా పని దొరక్కపోవడంతో తిరిగి హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమై అదే రోజు రాత్రి కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. మార్గమధ్యంలో దీపిక కదులుతున్న రైలు నుంచి కిందకు దూకేసింది. పక్క స్టేషన్‌లో రైలు ఆగగానే కిందకు దిగిన దీపక్ రోడ్డు మార్గంలో గార్లదిన్నె మండలం ఎగువపల్లి సమీపంలోకి శుక్రవారం తెల్లవారుజామున చేరుకున్నాడు. జాతీయ రహదారి పక్కన వాకింగ్ చేస్తున్న స్థానికులను కలసి రైల్వే స్టేషన్‌కు మార్గాన్ని అడిగి, అటుగా కాకుండా నేరుగా రైల్వే ట్రాక్‌పై చేరుకుని పట్టాలపై అడ్డంగా పడుకున్నాడు. గమనించిన స్థానికులు వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో గార్లదిన్నె ఎస్‌ఐ గౌస్ మహమ్మద్‌బాషా, సిబ్బంది అక్కడకు చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో జరిగిన విషయం తెలిపి తన సహచరి రైలు నుంచి దూకిందని, తాను కూడా ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధపడినట్లు వివరించాడు. దీంతో విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు గార్లదిన్నె – కల్లూరు మధ్య ట్రాక్‌పై పరిశీలన చేపట్టారు. కల్లూరు రైల్వే స్టేషన్ సమీపంలో రామ్‌దాస్‌పేట వద్ద పట్టాలపై యువతి మృతదేహాన్ని గుర్తించారు. మృతురాలిని దీపికగా మహేష్ నిర్ధారించాడు. ఘటనపై రైల్వే ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



పోలీసుల ఆధీనంలో ఉన్న మహేష్



మృతురాలు దీపిక

వ్యాపారి ఘరానా మోసం

- రూ.6.50 కోట్లకు టోకరా
- లబోదిబోమంటున్న బాధితులు
- న్యాయం కోసం పోలీసుస్టేషన్‌కు..

ఉరవకొండ: పట్టణంలో ఓ వ్యాపారి ఘరానా మోసానికి పాల్పడ్డాడు. పలువురి నుంచి నగదు తీసుకుని.. తిరిగి వారికి చెల్లించకుండా ముఖం చాటేశాడు. దాదాపు రూ.6.20 కోట్లకు ఐపీ పెట్టేసి టోకరా వేశాడు. బాధితులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉరవకొండ పట్టణంలోని రంగావీధిలో బొమ్మశెట్టి నగేష్‌బాబు, లావణ్య దంపతులు నివాసముంటున్నారు. వీరు కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. అలా ప్రజలతో ఏర్పడిన పరిచయాలతో చిట్టీల వ్యాపారం మొదలు పెట్టారు. వీరిపై నమ్మకం కలగడంతో చాలామంది పరిచయస్తులు, చిరువ్యాపారులు, చేనేత కార్మికులతో పాటు అన్ని వర్గాలకు చెందిన వారు అవసరాలకు పనికి వస్తుందని, పొదుపు చేసుకుందామని భావించి రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా చిట్టీలు వేశారు. ఉరవకొండతో పాటు ధర్మవరం, గుంతకల్లు, అనంతపురం తదితర ప్రాంతాలకు చెందిన వారు అప్పుల రూపంలోనూ వారికి ఇచ్చారు. ఈ క్రమంలో రెండు వారాల క్రితం అనారోగ్యంగా ఉందని చెప్పిన నగేష్ తర్వాత కనిపించలేదు. కుటుంబ సభ్యులు కూడా ఎవ్వరూ లేరు. ఇంటికి తాళం వేసి ఉంది. ఫోన్ స్విచాఫ్ వస్తుండటంతో అనుమానం వచ్చిన బాధితులు ఆరా తీయగా.. డబ్బుతో ఉడాయించినట్లు తెలిసింది.




నగేష్‌బాబు (ఫైల్)

కలకలం రేపిన ఐపీ నోటీసు

బాధితుల అనుమానాలకు ఊతం ఇచ్చేలా శుక్రవారం పలువురి సెల్‌ఫోన్లకు నగేష్ బాబు– లావణ్య దంపతుల తరఫున అడ్వొకేట్ నుంచి ఇన్‌సాల్వెన్సీ పిటిషన్ (ఐపీ) నోటీసు పంపారు. ఐపీ నోటీసు అలా ఒకరి నుంచి మరొకరికి చేరడంతో కలకలం రేగింది. కిరాణా వ్యాపార విస్తరణ కోసం 57 మంది నుంచి రూ.6.22 కోట్ల వరకు నగదు తీసుకున్నట్లు.. ప్రస్తుతం వ్యాపారంలో నష్టం కారణంగా తిరిగి చెల్లించలేకపోతున్నట్లు, నగదు రికవరీ కోసం ఒత్తిళ్లు తీవ్రస్థాయిలో పెరిగిపోతుండటంతో భరించలేక ఐపీ పెడుతున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. నమ్మకంతో చిట్టీలు వేసిన తమను నట్టేటముంచాడని బాధితులు ఆందోళన చెందుతున్నారు.

న్యాయం చేయకపోతే చావే శరణ్యం

తన కూతురుకు మూడుసార్లు బైపాస్ సర్జరీలు జరిగాయని, తదుపరి వైద్య అవసరాల కోసమని నగేష్‌బాబు వద్ద దాదాపు రూ.14 లక్షలు చిట్టీ వేశానని, ఇప్పుడిలా ఐపీ పెట్టేస్తే ఎలా అని ఉరవకొండకు చెందిన కిరణ్‌కుమార్ అనే హోటల్ నిర్వాహకుడు ఆవేదన వ్యక్తం చేశాడు. తమకు న్యాయం చేయాలని అర్బన్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. తామేమీ చేయలేమని పోలీసులు తెలిపారని, ఇక తాము ఎక్కడికి వెళ్లాలని కన్నీటి పర్యంతమయ్యాడు.



కిరణ్‌కుమార్

కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిషేధం

- ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చౌక్
- అక్కడ మాత్రమే అనుమతి మేరకు ధర్నా చేసుకోవాలి
- రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలకు ఎస్పీ రత్న విజ్ఞప్తి

పుట్టపర్తి టౌన్: ప్రజలకు ఇబ్బందులు కలగకూడదన్న ఉద్దేశంతో ఇక నుంచి కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిషేధిస్తున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. ఇక నుంచి అనుమతుల మేరకు ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహించుకోవాలని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కలెక్టరేట్ సమీపంలోని రహదారిలో సత్యసాయి విద్యాసంస్థలు, కళాశాలలు ఉన్నాయని, అలాగే సత్యసాయి శతజయంతి ఉత్సవాల నిమిత్తం దేశవిదేశాల నుంచి భారీగా భక్తులు వస్తున్నందున ధర్నాలు, ఆందోళనలతో వారికి ఇబ్బందులు తలెత్తకుండా, భక్తులు, పట్టణ ప్రజల సౌలభ్యాలను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులతో చర్చించి కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిషేధించినట్లు ఎస్పీ వెల్లడించారు. అలాగే ప్రతి సోమవారం తమ సమస్యలు విన్నవించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు 'పరిష్కార వేదిక' కోసం కలెక్టరేట్‌కు వస్తుంటారని ధర్నాల వల్ల వారికీ ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చౌక్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ ప్రాంతంలోనే పార్కింగ్ స్థలం కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ పార్టీలు నేతలు, ట్రేడ్ యూనియన్, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు గమనించాలన్నారు. అయితే ధర్నాలు, నిరసన కార్యక్రమాలకు పుట్టపర్తి డీఎస్పీతో ముందస్తు అనుమతి తీసుకోవాలని ఎస్పీ సూచించారు.

అయ్యవార్లకు 'ఓటీపీ' తలనొప్పి

- స్టూడెంట్ కిట్లు అందినట్లు ధ్రువీకరణకు తల్లిదండ్రుల మొబైళ్లకు ఓటీపీలు
- ఓటీపీ నంబర్లు చెప్పడానికి నిరాకరిస్తున్న తల్లిదండ్రులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం (2025–26)లో పంపిణీ చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర (స్కూడెంట్ కిట్ల) కిట్ల నిర్ధారణ కోసం విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ ఫోన్లకు వచ్చే ఓటీపీలు తీసుకోవడం ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. మొన్నటిదాకా బయోమెట్రిక్ విధానంలో తల్లిదండ్రుల నుంచి వేలిముద్రలు తీసుకుని నిర్ధారించుకునేవారు. అయితే తాజాగా ఓటీపీ విధానం తీసుకొచ్చారు. తల్లిదండ్రుల మొబైల్ ఫోన్లకు ఓటీపీ వెళ్తే...సంబంధిత హెచ్ఎం, టీచరు ఫోన్ చేసి ఆ ఓటీపీ నంబరు అడిగి యాప్‌లో నమోదు చేస్తే కిట్లు అందినట్లు ధ్రువీకరించనట్టవుతుంది. ఈ విధానం అయ్యవార్లకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. జిల్లాలో 1,648 స్కూళ్లలో 1–10 తరగతుల విద్యార్థులు 1,98,556 మంది చదువుతున్నారు. వీరందరికీ స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశామని అధికారులు చెబుతున్నా...క్షేత్రస్థాయిలో చాలామంది విద్యార్థులకు కిట్లలోని అన్ని వస్తువులూ నేటికీ అందలేదు. మరీ ముఖ్యంగా చాలా మండలాలకు 'షూ'లు అన్‌సైజ్ వచ్చాయి. అలాగే యూనిఫాం అందలేదు. ప్రతి స్కూల్‌లోనూ స్టూడెంట్ కిట్ల పంపిణీ సమాచారాన్ని 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఈ యాప్‌ను హెచ్ఎంలు, టీచర్లు అందరూ తమ మొబైళ్లలో డౌన్‌లోడ్ చేసుకున్నారు. యాప్‌లో వివరాలన్నీ నమోదు చేసి.. ఓటీపీ సబ్‌మిట్ చేయడానికి 8 – 10 నిమిషాలు పడుతోంది. దీనికితోడు కొందరు ల్లితల్లిదండ్రులు తమ మొబైల్ నంబర్లకు వచ్చే ఓటీపీని చెప్పడానికి నిరాకరిస్తుండటం మరింత ఇబ్బందికరంగా మారింది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

B.Tech. అడ్మిషన్స్

AP EAPCET లో క్వాలిఫైడ్ MPC స్టూడెంట్స్‌కి B.Tech నందు గర్ల్స్ ఇంజనీరింగ్ కాలేజీలో గవర్నమెంట్ సీట్స్‌లో జాయిన్ కావడానికి అడ్మిషన్స్ జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ కలదు. Cont : G.MURALI, 9030661651, ATP. [A-1671]

REAL ESTATE

TOLET

ATP టౌన్, ఇండియన్ బ్యాంక్ దగ్గర, 3 & 4BHK, 27'×25' పెద్దహాల్, 4 బాత్ రూమ్స్, 3 బెడ్ రూమ్స్, ఫ్రంట్ + బ్యాక్ ఓపెన్ స్పేస్ పోర్టికో, ఆఫీస్ రూమ్, 2 గీజర్స్ గల డూప్లెక్స్ హౌస్, ఆఫీస్‌లకు కూడా అనువైనది. సెల్: 9440430644. [SCA25006675]

స్థలము అమ్మకము

అనంతపురం నడి బొడ్డున జిల్లా కలెక్టర్ ఆఫీస్ వెనుక (M.P.D.O ఆఫీసు వెనుక లైన్) 15.5 సెంట్ల స్థలము అమ్మబడును. తూర్పు దిశగా C.C రోడ్డు & పక్కన ఇళ్ల మధ్యలో క్లియర్ టైటిల్ ఉన్నది. వెడల్పు 67Fts పొడవు 100Fts. Contact: 9949216249 / 9000336567 / 9438879816. [A-4143]

PLOT FOR SALE

16 సెంట్ల ఓపెన్ ప్లాట్లు 14 లక్షలు మాత్రమే. తూర్పు ఉత్తరం ఫేస్. మధురా నగర్ వెంచర్‌లో ప్యాపిలి గుత్తి హైవే బెంగుళూరు రోడ్. 9949129126. [SCA25006683]

1 సెంటు 1 లక్ష రూపాయలు మాత్రమే. 2 సెంట్లు తీసుకున్న వారికి 1 సెంటు పూర్తిగా ఉచితం. గుత్తి టు తాడిపత్రి హైవే రాయలచెరువు మోడల్ స్కూల్ అనుకొని. వివరాలకు సంప్రదించండి : 86886 15599. [SCA25006579]

SERVICES

BUSINESS OFFER

Apple స్టైమ్ సెల్ ఉత్పత్తులకు డిస్ట్రిబ్యూటర్లు కావాలి (న్యూట్రిషన్ సప్లిమెంట్స్) ప్రతి కొనుగోలుపై క్యాష్‌బ్యాక్ అవకాశంతో అన్ని ఆరోగ్య సమస్యలకు ఉత్తమ ఫలితాలను పొందండి. Cell/W : 9392115495 [WB-15577]

CHANGE OF NAME

I, SHAIK SHEKSHAVALI (Old Name) S/o SHAIK MAHAMOOD, Husband of SHAIK MALLIKA R/o # 7/35C, Bhagya Nagar, GUNTAKAL, Anantapur Dist., A.P. PIN - 515801. I have changed my name to SHAIK SHAIKSHA VALI (New Name). Henceforth, I will be known as SHAIK SHAIKSHA VALI. [SCA25006662]

WANTED

ATP టౌన్ లో, TEA ఫ్రాంచైజీ నందు పనిచేయుటకు 5 మంది యువతులు (లేడీస్) కావలెను. Q: ఇంటర్, వివరాలకు సెల్: 8688679348. [A-7144]

అనంతపురం పట్టణంలోని ప్రముఖ కళాశాలలో పని చేయుటకు క్లీనింగ్ స్టాఫ్ మరియు బాత్రూమ్ కడిగే సిబ్బంది కావలెను. హాస్టల్ లో ఉండు వారికి ప్రాధాన్యత. సెల్: 8019414133, 9032797933. [A-7147]

ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663 [SCA25006667]

Work from home మా కంపెనీ అడ్వర్టైజ్మెంట్లు మీ మొబైల్ ద్వారా పార్ట్ టైం పంపుటకు స్త్రీ/పు. కావలెను. వారానికి 3,500. వివరాలకు వాట్సాప్‌లో hi అని మెసేజ్ పెట్టి కాల్ చేయండి 82478 08801 [SCA 25006542]

WANTED Hindi Teacher, Incharge Salary 30000 to 40000 per month. Food and accommodation are provided Cont: 9502485242, 7396879051. [SCA25006689]

యాడికి మండలం చుట్టుపక్కన గ్రామాల నిరుద్యోగులకు శుభవార్త. పెట్టుబడి లేకుండా రియల్ ఎస్టేట్ బిజినెస్ చేయాలనుకుంటున్నారా. వివరాలకు సంప్ర: 94907 63299. [SCA25006581]

Female Computer Operators with basic English & Hindi speaking skills are invited for an interview at our office in Kovur Nagar, Anantapur. Please call 9393710640 for an appointment. [A-1670]

Wanted Staff to Degree College: Computer Science, Commerce, English, Chemistry, Attender. Principal.ssmmdc1@gmail.com, Cell: 9491156253, 7075468222. [SCA25006402]

మెరైన్ వాటర్ సొల్యూషన్స్ కంపెనీ యందు పనిచేయుటకు సర్వీస్ టెక్నిషియన్స్, ప్లంబర్లు మరియు ఫీల్డ్ స్టాఫ్ కావలెను. జీతం: నెలకు 12000–20000, Age : 21 To 28. Qua : ITI / Diploma, Ramnagar. ATP. Ph: 9966620252, 9100703123. [SCA-25006561]

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959021122, 9959031122 [B-1275594]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

4 లైన్లు రూ. 270/- అదనపు లైను రూ. 60/-

ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723, 9494767933
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088 RAYADURG : 9010470185

